పొగాకుతో తీవ్ర అనారోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న మద్దిపాడు వైద్య ఆరోగ్య సిబ్బంది

మద్దిపాడు: పొగాకు వాడకాన్ని నిలిపి వేసి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని పీహెచ్‌సీ డాక్టర్లు శ్రావణ్, జగదీష్ అన్నారు. మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించి మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వైద్యశాఖ సిబ్బందితో సూపర్‌వైజర్ బాలకోటయ్య ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నామని సిగరెట్లు వద్దు మన ఆరోగ్యమే ముద్దు అన్నారు. పొగాకు వాడకం శరీర అవయవాలపై దుష్ప్రభావం చూపుతుందని రక్త ప్రసరణకు అంతరాయం కలిగిస్తుందని వారు తెలిపారు. గొంతు క్యాన్సర్, గుండెపోటు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మలేరియా రాకుండా ఉండాలంటే ఇంటి ముంగిట నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఆదే విధంగా మురుగు నీరు బయటకు వెళ్లే విధంగా చూసుకోవాలన్నారు. సర్పంచ్‌లతో చర్చించి బ్లీచింగ్ చల్లించాలని తద్వారా కొంత మేర దోమలు వ్యాప్తి చెందకుండా చూడవచ్చని వారు తెలిపారు. మండలంలో ఎక్కడా మలేరియా జ్వరాలు రాకుండా అప్రమత్తంగా ఉందామని వారు సిబ్బందికి తెలిపారు. సీహెచ్‌ఓ రజిత కుమారి ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

ఒంగోలు టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇళ్లల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమలు పెరగకుండా ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించడం ద్వారా మలేరియా ప్రబలకుండా చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. దోమ కాటు నుంచి రక్షించుకునేందుకు కాళ్లు చేతులు కప్పేసేలా పొడవాటి లేతరంగు దుస్తులు ధరించాలని, ఇంటి లోపల, బయట మూత లేకుండా నీళ్లు నిల్వ ఉంచ కూడదని, వారానికి ఒకసారి నీటి నిల్వలను పారవేయాలని సూచించారు. మలేరియా అని అనుమానం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్యుడి సలహా ప్రకారం వైద్య చికిత్సలు తీసుకోవాలన్నారు. దోమకాటు ఆరోగ్యానికి చేటు కనుక దోమకాటు వ్యాధులపై ప్రజలంతా సరైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా.మాధవీ లత, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు, సబ్ యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యకరమైన దిగుబడులు పొందుతామని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి అన్నారు. రూరల్‌లోని కరవదిలో వివిధ రకాల విత్తనాలు విత్తుకోవటం, తొలకరిల్లో పాటించాల్సిన సూత్రాలను విషయాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీనియర్ కలన్సెంట్ రాజేశ్వరరావు, రీజినల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, కరవదిలోని కోటి పద్మావతి భూక్షేత్రంలో 32 రకాల విత్తనాలతో కూడిన పలు జాతుల నూనెగింజలు, సుగంధ ద్రవ్యాలు, పప్పుదినుసులు, ఆకుకూరలు, భూక్షేత్రంలో విత్తనాలు విత్తే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 45 రోజుల తర్వాత దిగుబడి పొందటమే కాకుండా పశువుల మేతగా వాడుకోవటం, భూమిలో కలియుదున్నటం ద్వారా కార్బన్ శాతం పెరిగి భూమి సారవంతంగా మారుతుందని పోషకాలు సమృద్ధిగా పంటలకు అందుతాయని డీపీఎం సుభాషిణి అన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కషాయాలు, ద్రావణాలు, తయారు చేసే విధానం, వాటివలన కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయం గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు నరసింహులు కొట్టం, రెడ్డప్ప, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

ఒంగోలు: మన విద్యారంగం బాగుపడాలంటే ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి బాలబాలికలకు నాణ్యమైన విద్యను అందించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవో హోంలో జరిగిన మధ్యంతర జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల్లో అదనంగా ఒక గంట పనిచేసి పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఒకే తరహా సిలబస్‌ను ప్రవేశపెట్టాలని, ఉపాధ్యాయుల పోస్టులు భర్తీచేసి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్‌ఐ పతాకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉండాలన్నారు. డిసెంబర్ 14 నుంచి 17 వరకు కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు, విద్యారంగం మీద ప్రత్యేక కార్యాచరణ తీసుకువస్తాయని , ప్రతి యూటీఎఫ్ సభ్యుడు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. సభలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్. రవి, అధ్యక్షులు ఓ.వీరారెడ్డి, సహాధ్యక్షులు షేక్ అబ్దుల్లా, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి యస్.చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్సా పోరాట జీవితం ఆదర్శనీయం



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఒంగోలు టౌన్: సీఐటీయూ అధ్యక్షుడిగా 22 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు పనిచేసి కార్మిక హక్కుల సాధనలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన పర్సా సత్యనారాయణ పోరాట జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పర్సా శత జయంతి సభలో ఆయన మాట్లాడారు. కార్మిక లోకం పత్రిక నిర్వహణలో కీలక పాత్ర పోషించారని, అనేక మంది కార్యకర్తలను పార్టీలోకి తీసుకొచ్చి తర్ఫీదు ఇచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తుందని, కార్మికులంతా ఏకమై ఆ నల్లచట్టాలను తిప్పి కొట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సీనియర్ నాయకులు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. తొలుత పర్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో సీఐటీయూ నాయకులు, సీపీఎం నాయకులు పి.కల్పన, ఈదర అన్నపూర్ణ, యం.రమేష్, గంటెనపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి, యం.అయ్యప్ప రెడ్డి, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్ రాంబాబు, చిరంజీవి, టి.మహేష్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు 15లోపు తెలియజేయాలి

ఒంగోలు: స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్లకు సంబంధించిన సీనియార్టీ జాబితాను డీఈవోప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో పెట్టారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత మండల విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉప విద్యాశాఖ అధికారికి తెలియజేయాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఒంగోలు: స్థానిక సంతపేటలోని రంగాభవన్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అడ్వకేట్ కమిషనర్స్ మొలకలపల్లి అజయ్‌బాబు, బొడ్డు భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు కమ్యూనిటీ హాలు, పేద విద్యార్థుల వసతి గృహ కమిటీ రిజిస్టర్డ్ నంబర్ 515/1999 సర్వసభ్య సమావేశానికి సభ్యులు తప్పక తమ ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు.

సికెల్ సెల్ అనీమియాకు మెరుగైన వైద్యం

ఒంగోలు టౌన్: ఎస్టీ జనాభా అధికంగా కలిగిన ప్రాంతాల్లో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి సికెల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్య చికిత్స అందజేస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సికెల్ సెల్ అనీమియాపై వైద్య అధికారులు, సీహెచ్‌ఓ, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రాహుల్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 0 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన ఎస్టీలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉప వైద్యాధికారి డా.మాధవీ లత, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి డీవీ శ్రీనివాసరావు, మాస్ మీడియా అధికారి డి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ వెంటనే పెట్టుబడి సాయాన్ని అందజేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రసంగిస్తూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతాంగానికి 20 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందజేయాలని కోరారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా ఓటమి చెందాడానికి కారణం రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడమే అని సమావేశం అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. నరసింహులు, రాష్ట్ర నాయకులు సునీత, కె. నాంచార్లు, బుచ్చిరెడ్డి , మేకల ప్రసాదు, ఎస్. నాగరాజు, సీఎస్ సాగర్, రాజశేఖర్ పాల్గొన్నారు.